
**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**




రోజా చివ్వారి మనసు ఆనంద పరసు అయింది.

విజమే! ఆ కుక్కపిల్ల. కళ్ళు తెరచి కొన్నాళ్ళు కూడాకాని ఆ కుక్కపిల్ల తన కూడా కూడా వస్తోంది తను అలా భ్రమపడ్తోందేమో నని పరీక్ష కూడా చేసింది. ఆ కుక్కపిల్ల వస్తూన్న వైపుకు వ్యతిరేకంగా నడిచి చూసింది.

చిత్రం! అది కూడా తనదారి మార్చుకుని తన వెంటే వచ్చింది.. బాప్‌రే! ఆ కుక్కపిల్లకూడా తన అడుగుల ననుసరించి అడ్డదిడ్డంగా పరిగెత్తుకొచ్చింది.

ఓ రోజేమయింది? ఇంటర్వెల్‌లో తను బిస్కట్స్ కొని తింటూంటే చిన్న ముక్క విరిగి క్రింద పడింది. తను 'అయ్యో!' అను కుని క్రిందికి వంగి చూసేసరికి కుక్కపిల్ల ఆ బిస్కట్‌ను అందుకునే ప్రయత్నంలో కనిపించింది.

తెల్లని అందమైన కుక్కపిల్ల. గోధుమ రంగు మూతి. నల్లని కళ్ళు. గులాబీరంగు నాలుక. చాలా ముచ్చటేసింది.

స్కూల్లో బాత్ రూమ్స్‌కు వెళ్ళే దారిలో మూలకు వేప చెట్టు క్రింద కుక్క పిల్లల్ని పెట్టిందన్నారు. అందరూ దూరం నుంచి చూసి వచ్చారు. దగ్గరకు వెళ్తే తల్లి కుక్క కరుస్తుందట. తల్లి పొదుగుకు ఎగబడి పాలు తాగుతున్నాయి నాలుగో అయిదో పిల్లలు. ఆపిల్లల్లో ఇది ఒకటి. అప్పుడే తిరగటం. తినటం నేర్చిందన్నమాట!

ఆశ్చర్యం వేసింది రోజాకు. మేనత్తకు పాప పుట్టినప్పుడు చూసింది. అత్తయ్య మూణ్ణెల్లు వుంది వాళ్ళింట్లో. ఆ మూణ్ణెల్లో పాప ఒక్కసారి కూడా లేవలేదు. కూర్చో లేదు. నడవ లేదు. అలాంటిది కొన్ని రోజుల్లోనే ఈ కుక్కపిల్ల తిరుగుతోంది! తింటోంది!

కుక్కపిల్ల ప్రయత్నం నెరవేరింది. బిస్కట్ అందుకుంది.

రోజా మరో బిస్కట్ వేద్దామని చూసింది గానీ బిస్కట్స్ అయిపోయాయి. అంతలో బెల్ కొట్టేశారు. క్లాసులోకి వెళ్ళిపోయింది రోజా.

ఆ తర్వాత ఆ విషయం మరచిపోయింది రోజా. అయితే మరునాడు ఇంటర్వెల్‌లో

బిస్కట్స్ తింటూవుండగా ఆ కుక్కపిల్ల మళ్ళీ కనిపించింది. ఈసారి తనే బిస్కట్ వేసింది రోజా.

కుక్కపిల్ల ఆనందంగా తోక వూపుతూ బిస్కట్ తింది. అంతలో తల్లి కుక్క, దాని వెంట మిగిలిన పిల్లలు వచ్చాయి. తెల్ల కుక్కపిల్ల తల్లితో వెళ్ళిపోయింది.

అంతే.

ఈ రోజు కుక్కపిల్ల తన కాళ్ళ వెంట తిరుగుతోంది తోక వూపుతూ చిన్న బిస్కట్ ముక్కకు ఎంత విశ్వాసం చూపుతోంది కుక్కపిల్ల!

ఆశ్చర్యం వేసింది రోజాకు. తమ ఇంట్లో పని వాళ్ళు గుర్తొచ్చారు. తల్లి ఎంతో అభిమానంగా చూస్తుంది వాళ్ళను. బాగా తిండి పెడ్తుంది. అయినా సరే. చిన్న మాటంటే చాలు పని మానేస్తామని కూర్చుంటారు.

రోజా చిన్ని బుర్రకు ఓ చిత్రమైన. ఆలోచన వచ్చింది. కుక్కపిల్ల బిస్కట్ కోసం తనవెంట పడటంలేదు కదా! తిండి కోసమే అయితే అది విశ్వాసం ఎలా అవుతుంది? రోజా చురుకైన మనస్తత్వం ఈ విషయాన్ని తేల్చుకోవాలని సూచించింది.

రోజా బిస్కట్ వెయ్యలేదు కుక్కపిల్లకు.

ఇంటర్వెల్ అయిపోయింది. రోజా క్లాసులోకి వెళ్ళిపోయింది.

లంచ్ అవర్‌లో రోజా క్లాసు బయటకు రాగానే దూరంగా మిగిలిన పిల్లలతో ఆడుకుంటూన్న కుక్కపిల్ల పరిగెత్తుకుని వచ్చింది.

రోజాకు చాలా సంతోషంగా అనిపించింది. తనకోసం ఒక ప్రాణి. కుక్క పిల్ల అయితే మాత్రమేం. ఆరాటపడటం ప్రత్యేకంగా గుర్తించటం. ప్రేమించటం రోజాలో వింతగా. పులకింతగా అనిపించింది.

తల్లి తన కోసం క్యారియర్‌లో కలిపి పెట్టిన నెయ్యి అన్నం ముద్దచేసి కుక్కపిల్ల ముందు పెట్టింది.

ఎందుకో తెలీదు కుక్కపిల్ల వాసన చూసి దూరంగా జరిగింది.

రోజా అన్నం తినేదాకా రోజా చుట్టే వుంది కుక్కపిల్ల నీళ్ళుతాగడానికి కొళాయి దగ్గరకువెళ్ళినప్పుడు అక్కడికీ పరిగెత్తింది.

బెల్ కొట్టాడు

రోజాను క్లాస్‌రూం దాకా సాగనంపి మళ్ళీ పరిగెత్తుకుని తల్లి దగ్గరకు వెళ్ళిపోయింది

ఇదంతా గమనించిన రోజా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది.

"నో డౌటాఫిట్. ఇట్ లవ్స్ మీ" అనుకుంది ఆ కాన్వెంట్ స్టూడెంట్.

సాయంకాలం ఇంటిబెల్ కొట్టారు. రోజా క్లాస్‌రూంలోంచిస్కూలు ఆవరణలోకిరాగానే గునగున పరిగెత్తు కొచ్చింది కుక్కపిల్ల!

ఆనందంతో కన్నీళ్ళుతిరిగాయి రోజాకు.

ఈ కుక్కపిల్ల తననెలా గుర్తుపడ్తోంది ఇంత మందిలో! ఒకే యూనిఫారంలో వున్న ఇంతమందిలో!

కుక్కపిల్ల "కుయ్యో. కుయ్యో"మంటూ రోజా వెంట పడింది. 'ఐ లవ్ యూ' అన్నట్లుగా అనిపించింది రోజాకు. "ఐ టూ" అనుకుంది రోజా.

రోజా చుట్టూ చూసింది. తల్లి కుక్క ఆ ఛాయల్లో కనిపించలేదు. వంగి చటుక్కున కుక్కపిల్లనందుకుంది.

తెల్లగా. మెత్తగా పావురాయిలా వుంది కుక్కపిల్ల. ఇబ్బందిగా కదలలేదు. దిగిపోవడానికి గింజుకోలేదు. తల్లి ఒడిలోకి చేరిన పసికూనలా ఆనందంగా ఒదిగిపోయింది రోజా చేతుల్లో. దాని స్పర్శ గిలిగింతలు పెట్టింది రోజాకు. పులకింతలు కలిగించింది.

గబగబా ఇంటికేసి నడిచింది రోజా.

## 2

తెల్లగా మల్లె పువ్వులా వున్న కుక్క-



## పరిచయం

జన్మించినదీ, చదువుకున్నదీ, ప్రస్తుతం వుంటున్నదీ కర్నూల్లోనే. శ్రీవాస శ్రీనివాసరావు గారి సహకారం నా సాహిత్య జీవితానికి నాంది కారణం. సాహిత్యం ఆరాధ్యం. సంగీతం అభిమానం. పది మందికి నచ్చే రచనల కంటే పదిమందికి వుపయోగపడే రచనలు చేయాలని తాపత్రయం.

దాదాపు అన్ని పత్రికలలో చాలా కథలు ప్రచురితం అయ్యాయి. అర డజను సీరియల్ నవలలు, అరడజను డైరెక్టు నవలలు వచ్చాయి. మరో మూడు నవలలు వివిధ వార పత్రికలలో సీరియల్స్‌గా ప్రచురితం కాబోతున్నాయి. రేడియోలో కథలు, ప్రసంగాలు 'తంగేడులా తీపు మీదే' సీరియల్ నాటకం ప్రసారం అయ్యాయి. కొన్ని కథలు కన్నడ భాషలోకి అనువాదం చేయబడ్డాయి.

'ఏ గుండె కార్చిన కన్నీళ్లు' (ఆంధ్ర పత్రిక) కథకు మొదటి బహుమతి, 'కాకిగూడు', (ఆంధ్రజ్యోతి). 'పాలు', (ఆంధ్రభూమి) కథలకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి. మరోసారి నా కథకు బహుమతి రావటం వెన్న ఆనందంలో ముంచెత్తింది ఈ కథకు ఈ రూపం రావడానికి కారణమైన సాహితీ మిత్రులు ఎం. దివాకర్ బాబుగారికి, బహుమతి నిచ్చి ప్రోత్సహించిన ఆంధ్రజ్యోతి సంపాదక వర్గానికి కృతజ్ఞతలు.

—చక్కిలం విజయలక్ష్మి



పిల్లకు "జాస్మిన్" అని పేరు పెట్టుకుంది రోజా. ఈ విషయంలో తల్లి సలహా కూడా తీసుకుంది. జాస్మిన్‌కు ఏమేం పెట్టాలో తల్లి నడిగి తెలుసుకుంది. కుక్కపిల్లలు నెయ్యి తినవని తల్లి చెప్పగా తను పెట్టిన అన్నం తినకపోడానికి కారణం కూడా గ్రహించింది.

అప్పటికప్పుడు తన ఫ్రెండ్సందరినీ తీసుకొచ్చి జాస్మిన్‌ను చూపించింది.

ఆ రోజంతా జాస్మిన్‌తోనే సరిపో యింది రోజాకు.

"చదువుకోవా ఏంటి?" నవ్వుతూ మందలించింది తల్లి.

"రేపట్నించీ చదువు కుంటాలే" అంది కొత్త మురిపెం తీరని రోజా.

ఆ రాత్రంతా రోజా కలల నిండా జాస్మినే.

మరునాడు జాస్మిన్ బాధ్యత తల్లి కప్పగించి పదే పదే "జాగ్రత్త" అని చెప్పి స్కూలుకు వెళ్ళిపోయింది రోజా.

రోజా తల్లి నవ్వుకుంది.

వెళ్ళగానే క్లాస్‌మేట్ పరిమళ అంది "నిన్న నీవు తెల్ల కుక్క పిల్లను తీసికెళ్ళావు కదూ?"

"ఔను అది నా వెంట వచ్చింది మరి" రోజా అంది.

"దాని తల్లి దాని కోసం వెతుక్కుంటోంది పాపం." అంది పరిమళ.

"నీకెలా తెలుసు?"

"మాలి చెప్పాడు. కుక్కపిల్ల సంగతి అందర్నీ అడుగుతున్నాడు మాలి"

"నీవు చెప్పావా?" రోజా కొంచెం ఆదుర్దాగా అంది.

"ఊహూ. నిన్ను అడిగి చెబుదామని."

"తీసికెళ్తే ఏమిటట?" అడిగింది రోజా.

"ఇంకా పాలు తాగే పిల్లలు కాబట్టి తల్లి కుక్క బెంగ పెట్టుకుందట. కొంచెం పెద్దయిన తర్వాత తీసికెళ్తే బావుంటుందన్నాడు"

అంతలో బెల్ కొట్టారు.


ఇద్దరూ క్లాసులోకి వెళ్ళిపోయారు.

ఇంటర్‌వెల్‌లో చూసింది రోజా. పరిమళ చెప్పింది నిజమే! తల్లి కుక్క చాలా విచారంగా వుంది. దీనమైన చూపుల్తో కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతోంది. రోజా చేరువ కాగానే అనుమానంగా చూసింది. చిన్నగా మొరిగింది కూడా.

కుక్క గుర్తు పట్టిందా?

రోజాకు భయం వేసింది. పరిమళ చేయి అందుకుని గబగబా క్లాసు రూంలోకి వెళ్ళిపోయింది.

లంచ్ అవర్‌లోనూ, ఇంటికి వెళ్ళే సమయంలోనూ తల్లి కుక్క ఛాయలకు వెళ్ళకుండా జాగ్రత్త పడింది రోజా.



ఇంటికి రాగానే జాస్మిన్ తోకాడిస్తూ ఎదురు వచ్చింది.

ఎంతో సంతోషంగా అనిపించింది రోజాకు. స్కూల్ బ్యాగ్ అవతలకు గిరాటేసి జాస్మిన్‌ను ఎత్తుకుంది. అది సంతోష పడిన దానిలా చిగుళ్ళతో రోజా చేతిని కరచి పట్టుకుంది.

"మీ మమ్మీ నీ కోసం వెతుక్కుంటోంది తెలుసా?" అని దాని చెవిలో చెప్పింది.

తల్లి వచ్చి కసిరింది "ముందు స్నానం చేసి టిఫిన్ చేద్దువుగానిరా. తర్వాత దాంతో ఆటలు."

తల్లి స్నానం చేయిస్తుండగా బాత్‌రూం గుమ్మంలో నిలబడి తనకేసి చూస్తున్న జాస్మిన్ మీద చిలిపిగా నీళ్ళు చిలకరిస్తూ చెప్పింది రోజా "మమ్మీ. నేను లేనప్పుడు జాస్మిన్‌ను పెరట్లో కట్టివుంచు".

"ఎందుకు? అది బయటకు వెళ్ళనే లేదుగా?" అంది తల్లి.

"అది కాదు. జాస్మిన్ మమ్మీ దాని కోసం వెతుక్కుంటోంది. ఇక్కడికి వచ్చినా రాగలదు."

"అయ్యో! అలాగా! పాపం. మరి దాన్ని తల్లి దగ్గర వదిలేయకూడదూ?"

"వెవ్వెవ్వెవ్వె. జాస్మిన్‌ను నేను పెంచుకోవాలి. జాస్మిన్‌కు కూడా నేనంటే బోల్డు ప్రేమ!"

"కావచ్చు బేబీ. కానీ పాలుతాగే పసి కూనను పోగొట్టుకుని ఆ తల్లి ఎంత బాధ పడ్తూ వుంటుందో నీకు తెలీదురా".

"అంతా ఒట్టిది. దానికి ఇంకా బోల్డు పిల్లలున్నాయిగ".

"అయినా...." తల్లిమాట పూర్తి చేయనివ్వలేదు రోజా. బయటికి పారిపోయింది.

తల్లి ఎంత చెప్పినా వినలేదు రోజా. జాస్మిన్‌ను వదులుకోవాలని లేదు రోజాకు. అదంటే తనకెంత ప్రాణం!

మర్నాడు స్కూల్లో మాలి రోజానికూడా అడిగాడు 'నీవు గానీ తీసికెళ్ళావా అమ్మా?' అని

రోజా ఔనన్నట్లూ, కాదన్నట్లూ కాకుండా తల వూపింది.

"ప్చ్! ఎవరు తీసికెళ్ళారో! పాపం. ఆ కుక్క రాత్రంతా ఒకటే మొరుగుడు. మొన్నట్నించీ ఏమీ తిన్నట్టు కూడా లేదు." జాలిగా అన్నాడు మాలి.

నిజమే! కుక్క మొన్నటికీ ఈ రోజుకీ చాలా తీసిపోయింది. జాలిగొలిపేలా, నీరసంగా మూలమూలా తిరుగుతోంది. పున్నట్టుండి గట్టిగా, ఏడ్చినట్టుగా మొరుగుతోంది. మిగిలిన కుక్కపిల్లలు బిక్కమొహాలేసుకొని తల్లి వెంటవెంట తిరుగుతున్నాయి.

రోజా దాని కళ్ళ పడకుండా జాగ్రత్త పడింది

రోజాకు భయంగా, చెప్పలేని దిగులుగా అనిపించింది.

సాయంకాలం ఇంటికి వెళ్ళింది.

తోకాడిస్తూ ఒక్క గెంతున వచ్చి రోజా మీదికి ఎగబాకింది జాస్మిన్.

రోజాకు భయం, దిగులు తుడిచిపెట్టుకుపోయాయి.

"ఊహూ. జాస్మిన్ నాది" అనుకుంది. కుక్కపిల్లను గుండెల కదుముకుంది.

మర్నాడు స్కూలుకు వెళ్ళింది.

మామూలే

నీరసించిపోయిన జాస్మిన్ తల్లి.... దాని దైన్యంనిండిన చూపులు.... మొరుగుడు—

దాని కళ్ళలో "పాపాయిలూ నా పాపను చూశారా?" అనే ప్రశ్న. "దాన్ని వదలి నేనుండలేను" అనే నిస్సహాయత.

స్కూల్లో భయం. దిగులు. గుబులు.

ఇంట్లో ఉత్సాహం. సంతోషం. సంతృప్తి.

## 3

ఆ రోజు....

సాయంకాలం నాలుగు గంటలకు ఇంటికి రాగానే ఎప్పట్లా తోకాడిస్తూ ఎదురు రాలేదు జాస్మిన్.

ఆశ్చర్యంగా లోపలికి నడిచింది రోజా. గదులన్నీ చూసింది. ఎక్కడా జాస్మిన్ జాడ లేదు. తల్లి పెరట్లో ఏదో పని చూసుకుంటోంది.

"మమ్మీ, జాస్మిన్ ఏదీ?"

"ఇందాక వరండాలో వుంది. వుంటుంది చూడు" అంది తల్లి.

రోజా మళ్ళీ వరండాలోకి వచ్చింది.

"జాస్మిన్, జాస్మిన్" గట్టిగా పిలిచింది.

"........"

"జాస్మిన్........"

"............"

జాస్మిన్ ఇంట్లో ఎక్కడా లేదు. వరండాలో. ఇంటిముందు తోటలోనూ లేదు.

కంగారు ఎక్కువయింది రోజాకు.

గేటు తీసుకుని బయటకు వచ్చింది.

జాస్మిన్ కోసం ఆ చుట్టుపక్కలంతా వెదికింది రోజా. ఇరుగు పొరుగు ఇళ్ళలో అడిగింది. జాస్మిన్ జాడ లేదు.

రోజా గుండెలు బరువెక్కాయి.

అడుగులు తడబడ్డాయి.

కళ్ళు చెమ్మగిల్లాయి.

జాస్మిన్‌ను వెదికి పట్టుకోవాలి. లేకపోతే తనకు అన్నం తినాలనిపించదు. చదువుకోవాలని పించదు. స్కూలుకు కూడా వెళ్ళ బుద్ధి కాదు.

ఎటు వెళ్తోందో తనకే తెలీకుండా జాస్మిన్‌ను వెదుకుతూ, పేరు పెట్టి పిలుస్తూ వెళ్ళిపోయింది రోజా.

* * *


దాదాపు రెండు గంటల తర్వాత నౌఖరు రోజాను ఎత్తుకుని ఇంటికి తీసుకు వచ్చాడు. రోజా చేతుల్లో జాస్మిన్.

వరండా మెట్ల మీదే చతికిల పడినట్లుగా కూర్చుని వున్న రోజా తల్లి, నౌకరు గేటు దగ్గరకు రాగానే అతని చేతుల్లోని రోజాను చూసి ఒక్క వుదుటున లేచి నిలబడింది.

ముందుకు పరిగెత్తుకు రాలేదు.

ఆనందంతో ఆమె స్థాణువయింది.

నౌఖరు ఆమె దగ్గరగా వచ్చాడు.




ఆమెలో చలనం వచ్చింది.

రోజాను లాక్కున్నట్లుగా అందుకుని "నా తల్లి, నా బంగారుకొండ. ఎంత గాభరా పెట్టేశావ్! ఇంకో గంట గడిస్తే నా ప్రాణాలే పోయేవి. నా వరాలమూటా, ఎక్కడికిపోయావు తల్లీ?" అంటూ ఏడుస్తూ రోజాను ముద్దులతో నింపేసింది.

జాస్మిన్ ఎక్కడ దొరికిందో చెబుదామని వుత్సాహంగా నోరు తెరిచిన రోజా, నోరు తెరుచుకుని అలాగే వుండిపోయింది.

తల్లి ముఖం ఏడ్చి ఏడ్చి వుబ్బిపోయి కళ్ళు వాచిపోయి ఎర్రగా నిప్పుల్లా వున్నాయి. జుట్టుముడి వీడిపోయింది కూడ ఆమె గ్రహించలేదు. విపరీతమైన దుఃఖం అనుభవిస్తున్న దానిలా ఆమె పెదాలు అదురుతున్నాయి. పాముకాటు తిన్నదానిలా ఆమె ఒంటి రంగు నలుపుకు తిరిగిపోయి వుంది.

సర్వస్వాన్నీ పోగొట్టుకుని తిరిగి అనుకోకుండా పొందినదానిలా తనను చూసిన క్షణంలో తల్లి ముఖంలో వెలిగిన వెలుగు...

తల్లి స్పర్శలో ఎన్నడూ లేనంత ఆర్తి. ఆనంద........

ఆమె సర్వ సుఖాల్ని తనలోనే నిక్షిప్తం చేసినట్లు తల్లి తనను అతి పదిలంగా, అపురూపంగా పట్టుకోవడం........

ఈ భావాలు అర్థమవుతున్నాయి రోజాకు.

తల్లికి రోజా దొరకడం ఇంకా నమ్మతగ్గ విషయంగా అనిపించినట్లు లేదు. వెక్కి వెక్కవస్తూ రోజా ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని తనివితీరా చూస్తోంది. 'ఇది నిజమా!' అన్నట్లు అనుమానంగా చూస్తోంది. ఆమె ముఖంలోని ప్రస్తుత ఆనందం, ఆర్తి కూతుర్ని పోగొట్టుకున్నప్పుడు అనుభవించిన ఆ వేదనకు స్పష్టంగా అద్దం వస్తున్నాయి.

రోజా తల్లి వదనంకేసి ఆశ్చర్యంగా, వింతగా, కొత్తగా చూస్తోంది. తల్లిని చూస్తోంది. తల్లి అసలు రూపం చూస్తోంది- తల్లి మనసు చూస్తోంది.

మరో పావు గంట తర్వాత తల్లి తన పనిలో పడిపోయింది.

రోజా జాస్మిన్‌ను అందుకుంది. వరండా మెట్లురెండు దిగినదల్లా మళ్ళీ పైకివచ్చింది.

"మమ్మీ ఇప్పుడే వస్తాను" తల్లికి చెప్పింది రోజా.

"జాగ్రత్త. త్వరగా వచ్చెయ్" దెబ్బ తిన్న తల్లి మనసు హెచ్చరికగా అంది.

రోజా బయటకు వచ్చేసింది.

.... .... .... ....

అది స్కూలు.

మెయిన్‌గేట్ తాళం వేసుంది. చిన్న రివాల్వింగ్ గేట్‌లోంచి లోపలికి వచ్చింది రోజా.

బాగా సాయంకాలమైంది. దూరంగా మొక్కలలో పిచ్చి కోస్తున్న మాలి తప్ప ఎవరూ లేరు. క్లాసు రూములన్నీ తాళం వేసున్నాయి. చెట్ల మీది పక్షులు కలరవం చేస్తున్నాయి.

రోజా బాత్‌రూమ్స్ వైపు బయలుదేరింది.

వేప చెట్టు కింద....

జాస్మిన్ తల్లి ముందరి కాళ్ళ మీద మూతి ముందుకు చాచుకుని దీనంగా పడుకుని వుంది. డొక్కలు లోపలికి నొక్కుకుపోయాయి. దాని కళ్ళలోంచి తడి మెరుస్తోంది. కనుకొలకుల్లో వాలిన ఈగల్ని కూడా తోలుకునే శక్తి లేనిదానిలా శూన్యంలోకి చూస్తూ వుంది.

పాలు రాని రొమ్ములను వచ్చిరాని పళ్ళతో పీకుతున్నాయి పిల్లలు.

హృదయ విదారకమైన దృశ్యం!

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరకు వచ్చింది రోజా.

కుక్కలో కదలిక కనిపించింది. దాని చెవులు నిక్కబొడుచుకున్నాయి. ముక్కుపుటాలు పెద్దవయ్యాయి. అది చురుగ్గా మెరుపులా రోజాకేసి తల తిప్పింది.

రోజా!

రోజా చేతుల్లో దాని పిల్ల!

కుక్క దిక్కులు పిక్కటిల్లేలా "భౌ" అని అరవలేదు. రోజామీదపడి కసిగా పీక లేదు!

ఆర్తిగా, ఆనందంగా, తన అదృష్టాన్ని నమ్మలేనిదానిలా చూడసాగింది. నిస్తేజమైన దాని కళ్ళు ఎప్పుడో వెలుగు నింపుకున్నాయి. ఆశ్చర్యంతో స్తంభించిన దానిలా నిశ్చలంగా వుండిపోయింది.

రోజా జాస్మిన్‌ను చివరిసారిగా ముద్దు పెట్టుకుంది.

వంగి దాని తల్లి ముందు వదిలింది.